ప్రజాశక్తి
బుధవారం 27 ఆగస్టు 2025
I
అల్లూరి సీతారామరాజు

మెనూ అమలు చేయాలి

ప్రజాశక్తి -అనంతగిరి:మెనూను అమలు చేయాలని అరకు ఎమ్మెల్యే రేగం. మత్స్యలింగం ఆదేశించారు. మంగళవారం చిలకలగెడ్డ బాలుర ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల ఆరోగ్యం, టీచర్స్ పని తీరుపై ఆరా తీశారు. అనంతరం పాఠశాల రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజన అమలు తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మెనూ ప్రకారం రుచితో కూడిన భోజనాలు పెట్టినట్లయితే విద్యార్థినిలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యార్థులకు గుణాత్మకతో కూడిన విద్యను అందించాలని, అప్పుడే బయట ప్రపంచం తో విద్యార్థులు పోటీపడే తత్వం పెరుగుతుందన్నారు. వైసిపి మండల అధ్యక్షులు కె.సూర్యనారాయణ పాల్గొన్నారు,

భోజనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

సీలేరు జల విద్యుత్ కేంద్రానికి వెళ్లే రహదారిపై కూలిన చెట్టు

మన్యంలో ఏకధాటిగా భారీ వర్షం

»కూలిన చెట్లు » మునిగిన పంట పొలాలు

హుకుంపేటలో పాఠశాలపై కూలిన చెట్టు

ప్రజాశక్తి-సీలేరు: ఆంధ్రా, ఒడిస్సా సరిహద్దు సీలేరు పరిసర ప్రాంతాల్లో మంగళవారం ఉదయం నుంచి కుండపోత వర్షం కురుస్తోంది. దీంతో జనజీవనానికి ఇబ్బందులు ఏర్పడ్డాయి. జికె వీధి మండలం సీలేరు దుప్పిలివాడ దారకొండ పరిసర ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా భారీవర్షాలు కురుస్తున్నాయి. సీలేరు జలవిద్యుత్ కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిలో భారీవృక్షం రహదారికి అడ్డంగా కూలిపోయింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. వెంటనే ఎపి జెన్కో అధికారులు స్పందించి యుద్ధ ప్రాతిపదికన చెట్టుకొమ్మలు నరికి తొలగించారు. అనంతరం రాకపోకలు పునరుద్ధరించారు. మరోపక్క సీలేరుకు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఎర్రదిబ్బల ప్రధాన రహదారిపై భారీ వర్షాలకు వృక్షం కూలిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వాహనచోదకులు సమీప గ్రామాల్లో ఉన్న గిరిజనులను పిలిపించి చెట్టుని తొలగించారు.

పాఠశాల పై కూలిన చెట్టు

హుకుంపేట:మండల కేంద్రంలో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనం పైభాగంపై పెద్ద చెట్టు మంగళవారం కూలి పోయింది. ఆ సమయంలో పాఠశాలలో విద్యార్థులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రతిరోజూ విద్యార్థులు ఆ ప్రాంగణంలో తరచుగా రాకపోకలు సాగిస్తుంటారు. వర్షం కారణంగా వారు హాస్టల్లోనే ఉండటంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఈ సంఘటనతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఊపిరిపీల్చుకున్నారు.

నీట మునిగిన పొలాలు

అనంతగిరి:తుఫాను కారణంగా మండలంలోని సోమ, మంగళవారం రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా ఏకధాటిగా వర్షం కురుస్తూనే ఉంది. దీంతో జన జీవనం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గెడ్డలు, వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించాయి. సరియా, కటిక, తాడిగుడ, చిటంపాడు జలపాలలో అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. పిన్నకోట, పెదకోట, పెద్దబిడ్డ, .లుంగపర్తి, వేంగడ, వాలసి తదితర పంచాయతీ గ్రామాల్లో పంట పొలాలు నీట మునిగాయి. ప్రభుత్వం తక్షణమే నష్టం పరిహారం చెల్లించాలని రైతులు కోరారు.

అనంతగిరి మండలం పెదకోటలో మునిగిన పంట

రహదారి లేక ప్రసవ కష్టాలు

▶▶ వాగు దాటించి అంబులెన్స్ వద్దకు చేర్చిన వైనం ▶▶ మార్గమధ్యలోనే సుఖ ప్రసవం

గర్భిణిని తరలిస్తున్న మహిళలు

ప్రజాశక్తి-చింతపల్లి : మన్యంలో రహదారుల కష్టాలు మాతృమూర్తుల పాలిట శాపాలుగా మారాయి. సోమవారం పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణిని అంబులెన్స్ వద్దకు చేరేందుకు వాగును దాటించి తీసుకురావాల్సి వచ్చింది. మండలంలోని సీకాయబంధ గ్రామానికి చెందిన కొర్ర వెంకటరావు భార్య మాధవికి నెలలు నిండి పురిటి నొప్పులు రావడంతో ఆమెను ఆసుపత్రికి తరలించడానికి అనేక ఇబ్బందులు పడ్డారు. తమ గ్రామానికి సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో గ్రామం నుంచి అంబులెన్స్ వచ్చిన ప్రదేశానికి తీసుకెళ్లేందుకు మధ్యలో వాగు అడ్డంకిగా మారింది. పురిటి నొప్పులతో బాధపడుతున్న మాధవిని తోటి మహిళలు, ఆశా కార్యకర్త తాబేల్లి కుమారి సహాయంతో చేతులతో పట్టుకుని అంబులెన్స్ వద్దకు చేర్చారు. అప్పటికే ప్రసవ వేదనతో విలవలలాడుతున్న మాధవికి నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో చేసేదిలేక అంబులెన్స్ సిబ్బంది, ఆశా కార్యకర్త కుమారి అంబులెన్స్‌లోనే ఆమెకు ప్రసవం జరిపించారు. మాధవికి పండంటి మగ శిశువుకు జన్మనిచ్చింది. వెంటనే వారిని హుటాహుటిన లంబసింగి ప్రాథమిక ఆస్పత్రికి తరలించి చికిత్సను అందించారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని వైద్యాధికారులు తెలిపారు.

ఈ సందర్భంగా మాధవి భర్త కొర్ర వెంకట్రావు మాట్లాడుతూ ప్రతి వర్షాకాలంలో ఇలాంటి ప్రాణాపాయ పరిస్థితులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాగు ఉధృతంగా ప్రవహించినప్పుడల్లా రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయని తెలిపారు. ఆపదలో ఉన్నప్పుడు తమకు అండగా నిలిచిన ఆశా కార్యకర్త తాబేలు కుమారికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాలకు రోడ్డు సౌకర్యం, వంతెనల నిర్మాణం లేకపోవడం వల్ల ఇలాంటి పరిస్థితులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి తమ గ్రామానికి రోడ్డు వేసి, వాగుపై వంతెన నిర్మించి ప్రాణ నష్టాన్ని నివారించాలని కోరారు.

అనారోగ్యంతో డిఎస్‌సి ర్యాంకర్ జ్యోతి మృతి

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండల కేంద్రంలో గాంధీనగరం గ్రామానికి చెందిన ఇటీవల విడుదల అయిన డిఎస్‌సి ర్యాంకర్ జ్యోతి అనారోగ్యంతో మంగళవారం విశాఖ కేజీహెచ్ లో మృతి చెందింది. బంధువుల అందించిన వివరాలను ఇలా ఉన్నాయి, జ్యోతి తండ్రి మత్స్యరాజు టిడిపి పార్టీ సర్పంచ్ గా కొనసాగుతూ అనారోగ్యంతో గతంలో మృతి చెందారు. తల్లి కష్టంతో జ్యోతి చదువుకొని ఇటీవలే జరిగిన డీఎస్సీ పరీక్షల్లో ఉత్తీర్ణత పొంది ఎస్జీటీలో 74.40మార్కులు సాధించి అల్లూరు జిల్లా టాపర్ గా నిలిచింది. ఉద్యోగానికి ఎంపికయ్యింది. ఇంతలోనే మృత్యువు క్యాన్సర్ రూపంలో ఆమెను కడతేర్చింది. కొద్ది రోజులుగా బోన్ క్యాన్సర్ తో బాధపడుతూ మృత్యువుతో పోరాడుతూ విశాఖ కేజీహెచ్‌లో మంగళవారం తుది శ్వాస విడిచింది, జ్యోతి మృతుతో గ్రామస్తులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు,

29న ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:ఈనెల 29న అరుకు పంచాయతీ కేంద్రంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆక్సిజన్ ఆసుపత్రి వైద్యాధికారి ఎన్ విజయ్ కుమార్ తెలిపారు. అరుకులో అపోలోలో క్యాన్సర్ సెంటర్స్, ఆక్సిజన్ ఆధ్వర్యంలో ఉచితంగా క్యాన్సర్, తలసేమియా వ్యాధుల శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. పిల్లలతోపాటు పెద్దలకు వచ్చే రక్త సంబధిత క్యాన్సర్ తోపాటు థైరాయిడ్, దీర్ఘకాలిక వ్యాధులు, చాతినొప్పి, జీర్ణకోస వ్యాధుల పై వైద్య నిపుణులతో పరీక్షలను నిర్వహిస్తామన్నారు. వైద్య శిబిరానికి హాజరయ్యే రోగులు ఆధార్ కార్డులతో హాజరు కావాలని ఆయన కోరారు. పూర్తి సమాచారం కొరకు 9502011994కు సంప్రదించాలని ఆయన కోరారు.

ఎరువులు అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-చింతపల్లి : రైతులకు ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే డీలర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని చింతపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం.వినోద్ బాబు అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బందితో కలిసి మండల కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలను మంగళవారం ఆయన పరిశీలించారు. దుకాణాల్లో ఉన్న ఎరువుల నాణ్యతను పరిశీలించి, స్టాకు వివరాలను డీలర్లను అడిగి తెలుసుకున్నారు. స్టాక్ వివరాల పత్రాలను, ఇన్వాయిస్లను, డీలర్ల లైసెన్సులను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులను రైతులకు విక్రయించాలని డీలర్లకు స్పష్టం చేశారు. కృత్రిమ కొరత సృష్టించవద్దని, ఎరువుల నాణ్యత విషయంలో అవకతవకలకు పాల్పడితే సహించేది లేదని డీలర్లను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఎం వెంకటరమణ, రెవెన్యూ శాఖ ఆర్ఐ ఎం కృష్ణమూర్తి, వీఆర్వో పి పండయ్య పాల్గొన్నారు.

తనిఖీ చేస్తున్న అధికారులు

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

పిఒ కట్టా సింహాచలం

ప్రజాశక్తి- రాజవొమ్మంగి: ఏజెన్సీలో ఎక్కడైనా ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే వారిపై కఠినచర్యలు తప్పవని రంపచోడవరం ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం హెచ్చరించారు. మంగళవారం రాజవొమ్మంగిలో ఎరువుల షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో ఎక్కడైనా ఎరువులు ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని లేనియెడల తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా కావాలని ఎరువుల కొరత సృష్టించినట్లు తమ దృష్టికి వస్తే అటువంటి ఎరువుల దుకాణ యజమానులపై చర్యలు తీసుకుంటామన్నారు. తహశీల్దార్ అల్లు సత్యనారాయణ, ఎంపిడిఒ యాదగిరిశ్వరరావు, వ్యవసాయ అధికారి చక్రవర్తి, సిఐ గౌరీశంకర్, ఎస్ఐ నరసింహమూర్తి పాల్గొన్నారు.

ఎరువుల దుకాణం పరిశీలిస్తున్న పిఒ సింహాచలం

బాధితులను పరామర్శించడానికి వెళ్తే విమర్శలా?

వైసిపి నాయకులు ముత్యాల గౌతమ్‌ప్రభాకర్

ప్రజాశక్తి - విఆర్‌పురం: ముంపు బాధితుల సమస్యలు తెలుసుకోవడానికి ఆదివారం పర్యటనకు వచ్చిన మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మిపై విఆర్ పురం మండలం కూటమి నాయకులు విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని వైసిపి జిల్లా నియోజకవర్గ అధ్యక్షులు ముత్యాల గౌతమ్ ప్రభాకర్ విమర్శించారు. రేఖపల్లిలో ఆయన అధ్యక్షతన మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో వైసిపి మండల అధ్యక్షులు మాదిరెడ్డి సత్తిబాబు, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు మాచర్ల గంగయ్య మాట్లాడుతూ బాధితులను పరామర్శించడానికి వచ్చిన ధనలక్ష్మి వద్ద వడ్డుగూడెం కాలనీ రాజుపేట, శ్రీరామగిరి, చింతరేవుపల్లి తదితర గ్రామస్తులు ఎమ్మెల్యే శిరీషదేవి బాధితులను పరామర్శించడానికి రాలేదన్నారు. జిల్లా ఆర్టిఐ విభాగం అధ్యక్షులు బొడ్డు సత్యనారాయణ జిల్లా అధికార ప్రతినిధి చిక్కాల బాలకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వరద బాధితులను ఆదుకోవడంలో విఫలమైందని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో నాలుగు మండలాల్లో సుమారుగా 32 గ్రామాలను ముంపులో చేర్చి ఫస్ట్ ప్రయారిటీలో గ్రామాలను కలిపి సర్వేలు చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపించిన ఘనత వైసిపి ప్రభుత్వానిది కాదా అని ప్రశ్నించారు. చింతూరు కేంద్రంగా డయాలసిస్ సెంటర్‌ని ఏర్పాటు చేశామన్నారు. డయాలసిస్ బాధితులకు ప్రతినెలా రూ.10వేలు అందించామని గుర్తు చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఏదీ పూర్తిగా అమలు చేయలేదని ఎద్దేవా చేశారు.ఇప్పటికైనా కూటమి నాయకులు ముంపు బాధితులకు న్యాయం చేసే దిశగా ఆలోచన చేస్తే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

మాట్లాడుతున్న ముత్యాల గౌతమ్ ప్రభాకర్

విద్యార్థులతో మాట్లాడుతున్న పిఒ సింహాచలం

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన ఉండాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు బోధించాలని ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎపిఆర్ బాలికల పాఠశాల, స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాల, కళాశాలను ఆయన పరిశీలించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఒకటికి రెండు సార్లు ఉపాధ్యాయులు బోధించాలన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు వారి ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతిరోజు పక్కాగా మెనూ అమలు చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. విద్యార్థులకు పరిశుభ్రమైన ఆహారంతో పాటు వేడినీటిని అందజేయాలని ఆదేశించారు. వారికి ఆహారం ఏ విధంగా అందిస్తున్నారు, ఏ విధంగా బోధిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. అడ్డతీగల మండలం దాకోడు గిరిజన ఆశ్రమ పాఠశాలను పరిశీలించారు. తహశీల్దార్ సత్యనారాయణ, ఎంపిడిఒ యాదగిరి ఈశ్వరరావు, సిఐ గౌరీశంకర్, ఎస్ఐ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పల్లా త్రినాథరావు

పీసా చట్టంపై అవగాహన

ప్రజాశక్తి - వై.రామవరం: పీసా చట్టంపై ఎర్రంరెడ్డిపాలెం దలిపాడు పంచాయతీలలో మంగళవారం అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఐటిడిఎ లీగల్‌సెల్ అడ్వైజర్ పల్లా త్రినాథరావు మాట్లాడుతూ రాష్ట్రంలో మొత్తం 19 ఆదర్శ పంచాయతీలు ఎంపిక చేయగా అందులో రెండు పంచాయతీలు ఒకటి వై.రామవరం, ఇంకొకటి మారేడు మిల్లి మండలంలోని పుల్లంగి ఎంపికైంది. ఈ పంచాయతీలను ఆదర్శపంచాయతీలుగా గుర్తించారని చెప్పారు.

మాట్లాడుతున్న ఎస్‌డిసి బాలకృష్ణ

ఆర్అండ్ఆర్ పత్రాల సేకరణలో జాగ్రతలు అవసరం

ప్రజాశక్తి-విఆర్‌పురం: ఆర్అండ్అర్ ప్యాకేజికి సంబంధించి సేకరించే పత్రాల విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌డిసి బాలకృష్ణ సూచించారు. మంగళవారం ఎంపిడిఒ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు, మండల అధికారులు ముఖ్యంగా సచివాలయ సిబ్బంది, విఆర్ఒలు గతంలో పోయిన పత్రాలు తిరిగి సేకరించే విషయంలో జాగ్రత్తలు తెలిపారు. తహసీల్దార్ సరస్వతి, ఎంపిడిఒ ఇమ్మానుయేల్, సిసి దుర్గాప్రసాద్, తరుణ్ పాల్గొన్నారు.

నిలిచిపోయిన బస్సు

ప్రజాశక్తి -సీలేరు: పాడేరు డిపోకు చెందిన పాడేరు-భద్రాచలం బస్ మంగళవారం ఉదయం భద్రాచలం కాంప్లెక్స్‌లో బయలుదేరి వయా చింతూరు మీదగా వస్తుండగా ఫోర్‌బై వద్ద సాంకేతిక లోపాలు తలెత్తి నిలిచిపోయింది. డ్రైవర్ అప్రమత్తమై బస్సు పరిశీలించగా బస్సు సెంటర్ జాయింట్ మరమ్మతులకు గురైనట్లు గుర్తించారు. పాడేరు డిపో అధికారులకు సమాచారం అందించారు. బస్సులో ఉన్న ప్రయాణికులు కొంతమంది విజయవాడ బస్సు ఎక్కి వేరే మార్గం ద్వారా గమ్యానికి చేరగా మిగిలిన ప్రయాణికులు అందుబాటులో ఉన్న బస్సులో పంపించాలని అధికారులు సూచించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కండిషన్‌లో ఉన్న బస్సులను నడపాలని కోరుతున్నారు.

29న విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: రంపచోడవరం డివిజన్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో రంపచోడవరం రూరల్ సబ్ డివిజన్ పరిధి రాజవొమ్మంగి విద్యుత్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్టు ఇఇ గాబ్రియల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఘనంగా మదర్ థెరిసా జయంతి

నివాళులర్పిస్తున్న సర్పంచ్ చిట్టెమ్మ తదితరులు

అడ్డతీగల - ప్రజాశక్తి: స్థానిక మండల కేంద్రంలోని ఆర్టిసి కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న మదర్ థెరిసా విగ్రహానికి సంఘ సభ్యులు చోడిశెట్టి సుబ్బారావు ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్పంచ్ పప్పుల చిట్టెమ్మ హాజరయ్యారు. మదర్‌థెరిసా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటేశ్వరావు, ఆరోగ్యరాజ్, ప్రసాద్, జనసేన పార్టీకి చెందిన జయరాం, సాయి, వెంకన్న, అప్పు పాల్గొన్నారు.

మండల కేంద్రాల్లో జనరిక్ షాపులు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి -సీలేరు: రాష్ట్రప్రభుత్వం అన్ని మండల కేంద్రాల్లో జనరిక్ మందులుషాపులు ఏర్పాటు చేయాలని అల్లూరి జిల్లా కాంగ్రెస్ డిసిసి కార్యదర్శి కారే శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ నిరుపేద గిరిజనులు అతి ఖరీదైన మందులు ప్రైవేట్ షాపుల్లో కొనుక్కోలేక ఇబ్బందులకు గురవుతున్నారని ప్రభుత్వం జనరిక్ మందులు షాపులు ఏర్పాటు చేస్తే వారికి అందుబాటులో ఉంటాయని తెలిపారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేసి జనరిక్ మందుల షాపులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ సౌకర్యం కల్పించి వినియోగంలోకితేరూ!

విద్యుత్ కనెక్షన్ లేక ప్రారంభానికి నోచుకోని అంగన్వాడీ భవనం

- ప్రారంభానికి ముందే శిథిలావస్థకు...
- చిన్నారులు, సిబ్బంది అవస్థలు పట్టని వైనం
- 30 ఏళ్లుగా అద్దెకొంపలోనే కాలం వెళ్లదీత
- ఇదీ అనంతగిరి -1 అంగన్వాడీ భవన దుస్థితి

ప్రజాశక్తి -అనంతగిరి : ఎనిమిదేళ్ల క్రితం ప్రారంభించిన భవన నిర్మాణం ఎట్టకేలకు పూర్తయినా, విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో ఏడాదిగా వినియోగానికి దూరంగా ఉన్న పరిస్థితి ఇది. అద్దె భవనంలో సిబ్బంది, చిన్నారులు అవస్థలు పడుతున్నా, మండలకేంద్రంలోని అనంతగిరి-1 అంగన్వాడీ కేంద్ర భవనాన్ని ప్రారంభించేందుకు అధికారులు చొరవ చూపడం లేదు. అన్ని పనులు పూర్తయి, భవనం లోపల విద్యుత్ వైరింగ్ కూడా చేసినా కరెంట్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో సంబంధిత కాంట్రాక్టర్ ఐసిడిఎస్‌విభాగానికి అప్పగించకపోవడం వల్లే ఈ పరిస్థితి దాపురించింది. మండల కేంద్రంలో ఐసిడిఎస్ 1,2 సెక్టార్ ప్రాజెక్టు కార్యాలయాలకు కూతవేటు దూరంలో అనంతగిరి అంగన్వాడీ కేంద్రం భవనం పూర్తి చేసుకుని, ఏడాది క్రితమే ప్రారంభానికి సిద్ధమైంది. అయితే విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో సంబంధిత కాంట్రాక్టర్ దీన్ని ఆ శాఖకు అప్పగించడం లేదు. దీంతో ప్రారంభానికి ముందే ఇది శిథిలావస్థకు చేరుకునే దుస్థితి ఉండగా, అటు అంగన్వాడీ సిబ్బంది, చిన్నారులతోపాటు గర్భిణులు,బాలింతలు వంటి లబ్ధిదారులు ఇరుకైన అద్దెభవనంలో 30ఏళ్లుగా అంగన్వాడీ సేవలు పొందాల్సిన దుస్థితి ఉంది. అనంతగిరి-1 అంగన్వాడీ కేంద్రం భవన నిర్మాణానికి 2018- 19లో నిధులు మంజూరు కాగా సంబంధిత కాంట్రాక్టర్ భవన నిర్మాణ పనులు చేపట్టి పూర్తిచేశారు. భవనం పూర్తయినా లోపల సౌకర్యాలు లేకపోవడంతో 2024- 25లో మండల పరిషత్ నిధులతో లోపల టైల్స్, విద్యుత్ వైరింగ్ వంటి పనులు పూర్తిచేశారు. ఇక జిల్లా పరిషత్ నిధులతో ప్రహరీ నిర్మాణం కూడా పూర్తి చేశారు. అన్ని సౌకర్యాలతో భవనం పూర్తయి ఏడాది గడిచిన విద్యుత్ కనెక్షన్ మాత్రం ఇవ్వలేదు.దీంతో ఈ భవనాన్ని ఐసిడిఎస్ శాఖకు సంబంధిత కాంట్రాక్టర్ అప్పగించడంలేదు. ఫలితంగా ప్రారంభానికి నోచుకోని పరిస్థితి ఉంది. దీంతో 45 మంది పైగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలు అంగన్వాడీ సేవలు పొందుతున్న ఈ భవనం అద్దెపాకలోనే కాలం వెళ్లదీస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అనంతగిరి -1 అంగన్వాడీ కేంద్ర భవనానికి విద్యుత్ కనెక్షన్ ఇచ్చి వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.

నిరసన చేపడుతున్న కార్మికులు

శానిటేషన్ కార్మికుల సమస్యలను పరిష్కరించండి

ప్రజాశక్తి -పాడేరు: అల్లూరి జిల్లా పాడేరు ఏజెన్సీలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎల్.సుందర్రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాడేరులో ప్రభుత్వ ఆసుపత్రుల శానిటేషన్(పారిశుధ్య)కార్మికుల జిల్లా విస్తృత స్థాయి సమావేశం మంగళవారం నిర్వహించారు. అనంతరం నిరసన చేపట్టారు. ఈ సమావేశానికి పాడేరు జిల్లా ఆసుపత్రి, మెడికల్ కాలేజీ, అరకు ఏరియా ఆస్పత్రి, ముంచంగిపుట్టు, చింతపల్లి ఆసుపత్రులలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, శానిటేషన్ కార్మికులకు 2024 నవంబర్ నెలలో పెంచిన కొత్త వేతన జీవో ప్రకారం రూ.18600 వేతన పెంపు అమలు చేసి,ఏరియర్స్ చెల్లించాలని డ్యూటీ చార్ట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రధానంగా ఈపీఎఫ్ ఈఎస్ఐ తప్పిదాలను సరిచేయాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ప్రతినెల మొదటి వారం లో జీతాలు చెల్లించాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కోరారు, బకాయి వేతనాలు చెల్లించాలని, రెస్ట్ రూమ్స్ కేటాయించాలని డిమాండ్ చేశారు. జీతంతో కూడిన 9 జాతీయ సెలవులు ఇవ్వాలని, పని పరికరాలు(రక్షణ)ఇవ్వాలని, పేస్ట్ కంట్రోల్ ఎన్ఎంసి ఎన్ఆర్సి కేంటిన్, బర్త్ వెయిటింగ్, విభాగాలలో కార్మికులను నియామకం చెయ్యాలని డిమాండ్ చేశారు. లేకుంటే కార్మికులతో కలిసి ఆందోళన చేస్తామన్నారు.

అనంతరం పారిశుధ్య కార్మికుల జిల్లా కమిటీ ఎన్నుకున్నారు. కార్యదర్శి గా రఘు(అరకు), అధ్యక్షులుగా ముత్యాలమ్మ(పాడేరు), అరకు, పాడేరు, చింతపల్లి, ముంచంగిపుట్టు, మెడికల్ కాలేజీ, కార్మికులు కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. అన్ని ఆసుపత్రి కార్మికులు పాల్గొన్నారు.

స్త్రీ శక్తి విజయోత్సవ సభ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులోని మోదకొండమ్మ ఆలయ ప్రాంగణంలో మాజీ ఎమ్మెల్యే, పాడేరు టిడిపి ఇన్చార్జి గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో మంగళవారం స్త్రీ శక్తి విజయోత్సవ సభ ఉత్సాహంగా జరిగింది. కూటమి ప్రభుత్వ పాలనలో జరిగిన లబ్ధిని వివరిస్తూ మహిళలు ప్లకార్డులు ప్రదర్శించారు. టిడిపి మహిళా నేత బొర్రా విజయరాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అరకు పార్లమెంట్ టిడిపి ఇన్చార్జి, జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గిడ్డి ఈశ్వరి, కిడారి శ్రావణ్ పలువురు మహిళలతో ముచ్చటించి ప్రభుత్వ పథకాల అమలుపై ఆరా తీశారు. కిడారి శ్రావణ్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ప్రభుత్వం మహిళా సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలపై మహిళలకు వివరించారు. టిడిపి నాయకులు గోవింద్ మాస్టారు, బొర్రా నాగరాజు, రత్నకుమారి, డి.వెంకటరమణ(బుజ్జి), బి.వెంకటరమణ, పాండు, పార్వతమ్మ, అధిక సంఖ్యలో మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్

కొనుగోలు చేస్తున్న గిరిజనులు

మన్యంలో వినాయక చవితి సందడి

- మార్కెట్లలో జన సందోహం

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లా పాడేరు మన్యంలో వినాయక చవితి సందడి నెలకొంది. ఒకవైపు ముసురు వాతావరణం ఉన్నప్పటికీ మార్కెట్లో జన సందోహంతో వాతావరణం వేడెక్కింది. బుధవారం వినాయక చవితి కావడంతో పాడేరు పట్టణ ప్రజలు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావడంతో మార్కెట్ ప్రాంగణమంతా జనంతో కిక్కిరిసిపోయింది. మెయిన్ రోడ్డు కిరువైపులా వినాయక చవితి పూజ సామాగ్రిని పాలవెల్లులను పలు రకాల ఫలాల అమ్మకాలను పెద్ద ఎత్తున వ్యాపారులు చేపట్టడంతో మార్కెట్ అంతా సందడిగా మారిపోయింది. మట్టి వినాయక ప్రతిమలను పలు స్వచ్ఛంద సేవా సంఘాలు మార్కెట్ ప్రాంగణంలో ఉచితంగా పంపిణీ నిర్వహించాయి. భక్తులు కూడా మట్టి వినాయక ప్రతిమల పట్ల ఆసక్తితో వాటిని తీసుకువెళ్లారు. ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో పట్టణ విలేకరులు మట్టి వినాయక ప్రతిమలను భక్తులకు పంచిపెట్టారు. భారీ వినాయక విగ్రహాలు కూడా ఎక్కువగానే విక్రయించారు. గిరిజన గ్రామాల్లో ఊరంతా కలిసి గ్రామంలో ఒకచోట భారీ వినాయక విగ్రహాన్ని ప్రతిష్టించి వినాయక చవితి ఉత్సవాన్ని గిరిజనులు జరుపుకుంటుంటారు ఈ ఆనవాయితీ ప్రకారం భారీ విగ్రహాలను కొనుగోలు చేసి గ్రామాలకు తీసుకువెళ్లారు. గిరిజన గ్రామాల్లో మూడు రోజులు ఐదు రోజులు వారం రోజులపాటు వినాయక ఉత్సవాన్ని ఆనవాయితీగా జరుపుకుంటున్నారు. అనంతరం వినాయక నిమజ్జనం కార్యక్రమాలు కూడా భారీ ఊరేగింపులతో గ్రామస్తులు నిర్వహిస్తుంటారు. ఎంతో సందడిగా వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించుకోవడానికి ఈసారి కూడా గ్రామాల్లో భక్తులు విస్తత ఏర్పాటు చేసుకున్నారు..

ఫిర్యాదులు పరిష్కరించండి

ప్రజాశక్తి-పాడేరు: అన్నదాత సుఖీభవకు సంబంధించిన ఫిర్యాదులను పరిష్కరించి అర్హులైన లబ్దిదారులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్సు హాలు నుండి 22 మండలాల తహశీల్దారులు, సర్వేయర్లుతో వీడియో కాన్ఫరెన్సు లో అన్నదాత సుఖీ భవ, భూముల రీసర్వే, మ్యుటేషన్లు, దీపం పథకం గ్యాస్ పంపిణీ, రేషన్ పంపిణీ వంటి అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూముల రీ సర్వే మ్యుటేషన్ల ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అటవీ హక్కు పత్రాలు ఇచ్చిన భూముల లబ్దిదారుల ఆధార్ సీడింగ్ చేసి అన్నదాత సుఖీభవ అందేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. జలపాతాలు ఉన్న చోట అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. పర్యాటకులను జలపాతాల సందర్శనకు అనుమతించ వద్దని స్పష్టం చేసారు. జలపాతాల ప్రవేశాలను తాత్కాలికంగా మూసి వేయాలని చెప్పారు.

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ మాట్లాడుతూ, సెప్టెంబరు 6వ తేదీ నుండి జిల్లాలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ ప్రారంభమవుతుందని అన్నారు. జిల్లా వ్యాప్తంగా 2.98 లక్షల లబ్దిదారులు ఉన్నారన్నారు. వారం రోజుల వ్యవధిలో స్మార్ట్ కార్డుల పంపిణీ పూర్తి చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. 671 చౌక ధరల దుకాణాలు ఉన్నాయని వాటిలో 33 ఆన్లైన్ షాపులు, 638 ఆఫ్లైన్ షాపులు ఉన్నాయని చెప్పారు. చౌక ధరల దుకాణాలను రెవెన్యూ అధికారులు తనిఖీ చేయాలని సూచించారు. బియ్యం పంపిణీ, నాణ్యతలను పరిశీలించాలని స్పష్టం చేసారు. డిఆర్‌డిపోల వద్ద క్యూఆర్ కోడ్ ఉన్న బ్యానరును ఏర్పాటు చేయాలని చెప్పారు. లబ్దిదారులు క్యూర్ కోడ్ ను స్కాన్ చేయాలన్నారు. దీపం పథకం 2 లో లబ్దిదారులకు గ్యాస్ బండలను ఇంటికి సరఫరా చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో పాడేరు సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, డి ఆర్ ఓ కె. పద్మలత, సర్వే సహాయ సంచాలకులు దేవేంద్రుడు, 22, మండలాల తహశీల్దారులు, డిప్యూటీ తహశీల్దారులు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పెదబయలు : మండలంలోని బొడ్డపుట్టలో ఎమ్‌టిఎస్ ఉపాధ్యాయునిగా విధులు నిర్వర్తిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన పెటియ పురుషోత్తం కుటుంబానికి ఎమ్‌టిఎస్ ఉపాధ్యాయ సంఘం ఆర్థిక సాయం అందజేసింది. తమ సంఘం సభ్యులు మృతి చెందడంతో మానవతా దృక్పథంతో ఆయన కుటుంబానికి యూనియన్ ఆధ్వర్యాన ఎంఇఒ చేతుల మీదుగా దహన ఖర్చులకు రూ.15 వేలు, పెదఖర్మ కార్యానికి రూ.50 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ప్రభుత్వం నుండి రావలసిన బెనిఫిట్స్ తక్షణమే అందించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో పెదబయలు ఎమ్‌టిఎస్ ఉపాధ్యాయ సంఘం నాయకులు ఎ.కోటి, ఎన్.గంగాధరం, అప్పలస్వామి, సాధురం బాబూజీ, పద్మసేన్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - రంపచోడవరం : ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నియోజకవర్గం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ శిరీషదేవి, విజయ్‌భాస్కర్ అన్నారు. సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాతావరణ శాఖ తాజా నివేదిక ప్రకారం, అల్పపీడనం ప్రభావంతో రానున్న రెండు రోజులు అరకు, పాడేరు సహా అల్లూరి సీతారామరాజు జిల్లాలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. వర్షాల కారణంగా జలప్రవా హాలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉండొచ్చని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితిలో తప్ప బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వాగులు, గెడ్డలు దాటకుండా ఉండాలన్నారు. అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండాలని సూచించారు.

ముందుగానే నిత్యావసర వస్తువులు అందించాలి

ప్రజాశక్తి -విఆర్‌పురం: వరదలను దృష్టిలో పెట్టుకుని చింతరేగపల్లిలో ముందుగానే నిత్యావసర వస్తువులను అందించాలని చిన్నమట్టపల్లి పంచాయతీ సర్పంచ్ పిట్టా రామారావు డిమాండ్ చేశారు. ఇటీవల గోదావరి, శబరికి వరదలు రావడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడ్డారని మళ్లీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో బాధితులు ఆందోళన చెందుతున్నారు. ముందుగానే నిత్యావసర సరుకులు అందుబాటులోకి తెస్తే బాగుంటుందన్నారు. పీసా కమిటి సభ్యులు కోటం జయరాజ్, ముత్యాలమురళి, గూటాల ముత్యాలరావు గుటాల నవీన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

వివిధ వేషధారణలో ఉన్న విద్యార్థులు

డిఎవి పాఠశాలలో ఉత్సాహంగా చవితి వేడుకలు

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం సీలేరు డిఎవి పాఠశాలలో ముందస్తుగా వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం కిరణ్‌కుమార్ విద్యార్థులకు వినాయకవ్రత విశిష్టతను వివరించారు. అనంతరం వ్రత విశిష్టతను నాటక రూపంలో విద్యార్థులతో ప్రదర్శించారు. విద్యార్థులు వివిధ వేషధారణలతో ప్రదర్శించిన నాటిక పలువురిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఎంసి చైర్మన్ లోతా లక్ష్మణరావు

రైతులు పంట నమోదు చేసుకోవాలి

- ఎంఎంసి చైర్మన్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: రైతులంతా తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని ఎఎంసి చైర్మన్ లోతా లక్ష్మణరావు సూచించారు. మంగళవారం మండలంలోని శరబవరం గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతుసదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఎంసి చైర్మన్ లక్ష్మణరావు మాట్లాడుతూ రైతులంతా తప్పకుండా పంట నమోదు చేసుకోవాలని వ్యవసాయ పరికరాలు కావాల్సిన వాళ్లు తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. విఎఎ సంధ్య మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పెండింగ్‌లో ఉన్న జాబితా తెలిపారు. రైతులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో శరభవరం పంచాయితీ కార్యదర్శి, రైతులు పాల్గొన్నారు.

గర్భిణి మృతికి కారణాలపై 15 రోజుల్లో నివేదిక ఇవ్వాలి

కలెక్టర్, ఐటిడిఎ పిఒకు ఎస్‌టి కమిషన్ నోటీసులు

ప్రజాశక్తి - రంపచోడవరం : రంపచోడవరం ఏరియా ఆసుపత్రి నిర్లక్ష్యానికి గిరిజన మహిళ మతి వ్యవహారంరంపచోడవరం ఏరియా ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యానికి ఓ గిరిజన మహిళ మతి చెందిన వ్యవహారంలో అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్, రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలంకు జాతీయ ఎస్టి కమిషన్ నోటీసులు జారీ చేసింది. ప్రసవం కోసం 14 రోజుల పాటు వైద్యుల పర్యవేక్షణలోనే రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో ఉన్న తన భార్య కాకూరి పార్వతి(26) పట్ల వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించి తన భార్య మృతికి కారణమయ్యారని, బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుని అనాథలుగా మిగిలిన తన ఇద్దరు పిల్లలకు, తనకూ న్యాయం చేయాలంటూ వై.రామవరం మండలం జాజిగడ్డకు చెందిన పడాల దుర్గాప్రసాద్ జాతీయ ఎస్టి కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. 2025 జూలై 11న కాకూరి పార్వతి ప్రసవ సమయంలో అందాల్సిన మెరుగైన వైద్యం రంపచోడవరంలో అందక, ప్రాణాపాయ స్థితికి చేరుకున్నాక, ఆమెను రాజమండ్రి జిల్లా ఆసుపత్రికి తరలించి ఇక్కడి వైద్యులు చేతులు దులుపుకున్నారని ఆరోపించారు.

గిరిజనులకు అండగా నిలవాల్సిన రంపచోడవరం ఐటిడిఎ కూడా గిరిజన మహిళ మృతిపై సరిగా స్పందించలేదని కూడా పిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదును విచారణకు స్వీకరించిన కమిషన్ అల్లూరి జిల్లా కలెక్టర్, రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారికి నోటీసులు జారీ చేసి ఈ పై అభియోగాలపై తీసుకున్న చర్యల నివేదికను 15 రోజుల వ్యవధిలో తమకు సమర్పించాలని కమిషన్ డైరెక్టర్ డాక్టర్ కళ్యాణరెడ్డి ఆదేశించారు. లేనిపక్షంలో చట్టపరంగా తీసుకోవాల్సిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అస్తవ్యస్త రహదారితో అవస్థలు

అధ్వానంగా తయారైన ఆర్ వి నగర్ పాలగెడ్డ రహదారి

గోతులమయమైన రహదారి

ప్రజాశక్తి -సీలేరు: జికెవీధి మండలం ఆర్‌వినగర్ నుంచి పాలగెడ్డ వరకు అంతర్రాష్ట్ర రహదారి ఇప్పటికీ నిర్మాణానికి నోచుకోక పోవడంతో వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు రహదారి గోతుల్లో నీరు నిండిపోవడంతో ఎక్కడ గొయ్యి ఉందో, ఎక్కడ రోడ్డు ఉందో తెలియక వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆంధ్రా -ఒరిస్సా సరిహద్దు నుంచి సిమెంటు, ఇనుము ఇతర లోడ్ లారీలు ప్రతిరోజూ రాకపోకలు సాగిస్తుంటాయి. రహదారి బాగుచేయాలని పలుమార్లు ప్రభుత్వ అధికారులు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోయిందని వాపోతున్నారు. జిల్లా కలెక్టర్ ఐటిడిఎ పిఒ, జాయింట్ కలెక్టర్, సబ్‌కలెక్టరు ప్రజాసమస్యలపై పాడేరు నుంచి చింతూరు వరకు ఇదే మార్గంలో వెళ్లి వస్తూ ఉంటారు. అస్తవ్యస్తంగా ఉన్న రహదారి దుస్థితి కళ్లకు కట్టినట్లు అధికారులకు కనిపించినా ఏమి చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారని మండిపడుతున్నారు. విశాఖ వయా సీలేరు మీదుగా భద్రాచలం వెళ్లే నైట్ సర్వీస్ బస్సులు గతంలో రెండు తిరిగేవి. ఇటీవల రహదారి బాగోలేని కారణంగా ఒకటి రద్దు చేసి ఒకటి మాత్రమే తిప్పుతున్నారు. అదేవిధంగా అనేకసార్లు ఆర్టీసీ బస్సులు మరమ్మతులకు గురైన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రహదారి నిర్మాణాన్ని తక్షణమే చేపట్టాలని ఈ ప్రాంత ప్రజలు వాహన చోదకులు కోరుతున్నారు.

మెడికల్ రిప్స్‌కు ఆదర్శం మధు

డిపి దుబే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : అఖిలభారత మాజీ ప్రధాన కార్యదర్శి డి.పి దూబే వర్ధంతి నగరంలోని అఫీషియల్ కాలనీలో ఉన్న యూనియన్ ఆఫీసులో మంగళవారం జరిగింది. ముందుగా డిపి దుబే చిత్రపటానికి కె.కె చౌదరి, జిల్లా సహాయ కార్యదర్శి వర్మ పూలమాలవేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.వి.పి చంద్రమౌళి మాట్లాడుతూ డిపి దుబే ప్రధాన కార్యదర్శి పదవిని చేపట్టిన తర్వాత, కార్మికరంగంలో అనేక మార్పులు వచ్చాయని, ముఖ్యంగా గ్లోబలైజేషన్ ప్రక్రియ వచ్చి కార్మికవర్గానికి విపరీతమైన దోపిడీ జరిగి పలువురు ఉద్యోగాలు కోల్పోయారన్నారు. అయినప్పటికీ దుబే వంటి సమర్థమైన నాయకుడు ఉండడంతో ఆ సమయంలో మెడికల్ రిప్రజెంటేటివ్‌లు ఎవరూ ఉద్యోగాలు కోల్పోలేదన్నారు. పలు కంపెనీలు బై లేటరల్ డిస్కషన్ ద్వారా మెడికల్ రిప్రజెంటేటర్స్‌కి మరిన్ని సౌకర్యాలు కల్పించగలిగారని, అతని ఆశయ సాధనకు ప్రతి ఏటా అతని వర్ధంతి రోజున పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. విశాఖపట్నంలో జనరిక్ మందులపైన సెమినార్ నిర్వహించబోతున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి దారుణ హత్య

- చేతబడి నెపంతో చంపేసినట్టు అనుమానం

ప్రజాశక్తి-మోతుగూడెం: అల్లూరి సీతారామరాజు జిల్లా, చింతూరు మండలం, లక్కవరం ఏజెన్సీలో ఓ వద్ధుడిని అత్యంత దారుణంగా హత్య చేసిన ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే చింతూరు మండలం లక్కవరం గ్రామంలో మతుడు మూట రామయ్య (60)ను తల, మొండెం వేరు చేసి అత్యంత దారుణంగా హత్య చేసారు. మంత్రగాడు అనే నెపంతో హత్యకు గురైనట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విషయం తెలుసుకున్న స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో చింతూరు సిఐ గోపాలకృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

బజాజ్ పల్సర్ పండగ ఆఫర్లు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన వాహన సంస్థ బజాజ్ ఆటో లిమిటెడ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో తన హ్యాట్రిక్ ఆఫర్‌ను మంగళవారం నుండి అమలు చేస్తున్నట్లు సంస్థ విశాఖపట్నం జిఎం ప్రకాష్ తెలిపారు. మంగళవారం ఇసుకతోట వద్ద ఉన్న బజాజ్ షోరూమ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ పరిమిత కాల హ్యాట్రిక్ ఆఫర్‌లో ప్రత్యేక ధరలు, నగదు ప్రయోజనాలు, ఇతర డిస్కౌంట్లను పల్సర్ శ్రేణిపై ట్రిపుల్ ప్రయోజనాన్ని రైడర్‌లకు అందిస్తున్నామని తెలిపారు. ఈ ఆఫర్ దాదాపు అన్ని పల్సర్ మోడళ్లపైన ఉన్నాయని, ఈ హ్యాట్రిక్ ఆఫర్ ద్వార కస్టమర్లకు రూ. 10,000 విలువైన ప్రయోజనాలను ఉంటాయని నూతన వాహనం కొనుగోలుపై క్యాష్‌బ్యాక్ ఆఫర్, బీమా పొదుపు ప్రాసెసింగ్ రుసుము రద్దు వంటి సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. ఈ ఆఫర్స్ ఆంధ్రప్రదేశ్‌లో దసరా వరకు ఉంటాయని , ఇప్పటివరకు సంస్థ అందించిన అతిపెద్ద ఆఫర్‌లలో ఇది ఒకటని అన్నారు.

సిపిఐ రాష్ట్ర కమిటీలో పలువురికి స్థానం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: ఒంగోలు పట్టణంలో ఈ నెల 23 నుండి 25 వరకు జరిగిన సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 28వ మహాసభల్లో విశాఖ జిల్లా నుండి రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శిగా జివిఎంసి సిపిఐ పక్ష నాయకుడు, కార్పొరేటర్ ఎజె.స్టాలిన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలుగా మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు విమల, రాష్ట్రసమితి సభ్యులుగా పార్టీ సీనియర్ నాయకుడు, విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు పూర్వ అధ్యక్షులు, ప్రస్తుత ఉపాధ్యక్షుడు చలసాని రాఘవేంద్రరావు, పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్.కె రహిమాన్, పూర్వ జిల్లా కార్యదర్శి ప్రస్తుత జిల్లా కార్యవర్గ సభ్యుడు మరుపిళ్ల పైడిరాజు ఎన్నికయ్యారని రాష్ట్ర సమితి సభ్యుడు ఎం.పైడిరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

పారదర్శకంగా సంస్థాగత ఎన్నికలు

- టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : టిడిపిలో అన్ని ఎన్నికలు పారదర్శకంగా ఉంటాయని టిడిపి అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. మంగళవారం టిడిపి జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ ప్రయోజనాలకు, సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నవారిని ఎంపిక చేస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 25 పార్లమెంట్ అధ్యక్షులను నియమిస్తామని తెలిపారు. రాష్ట్ర నీటిపారుదల శాఖా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ టిడిపిలో వార్డు అధ్యక్షుడు నుంచి జాతీయ అధ్యక్షుడు వరకూ ఎంపిక పారదర్శకంగా జరుగుతుందన్నారు. స్టీల్‌ప్లాంట్‌పై జగన్ మొసలికన్నీరు కారుస్తున్నారన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి, విశాఖ లోక్ సభ సభ్యులు శ్రీ భరత్, ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవిరావు, మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్సీ పరిశీలకులు శ్రీరాంరెడ్డి గోపాల్ రెడ్డి, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కురుపూడి సత్తిబాబు, మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు , కోరాడ రాజబాబు పాల్గొన్నారు.